

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 20-08-2022 సంపుటి : 04 సంచిక : 04 పేజీలు : 4 వెల : రూ 3-00


# ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం ఇది: సీజేఐ ఎన్వీ రమణ



తిరుపతి: తిరుపతిలో సీజేఐ ఎన్వీ రమణ పర్యటించారు. ఈ సందర్భంగా గాంధీజీ ఆత్మకథ 'సత్యశోధన' పుస్తకాన్ని ఆవిష్కరించారు. గాంధీజీ జీవన సందేశాన్ని అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరంగా ఉందని ఎన్వీ రమణ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సత్యశోధన ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని అన్నారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ సేవలను కొనియాడారు. అహింస అనే ఆయుధంతో గాంధీజీ పోరాటం చేసారని.. నిజాయతీగా జీవితాన్ని ఎలా గడపాలో నేర్పించిన వ్యక్తం గాంధీజీ అని అన్నారు. రాస్ నిర్వాహకులు, పద్మశ్రీ గ్రహీత స్వర్గీయ గుత్తా మునిరత్నం విగ్రహాన్ని సీజేఐ ఆవిష్కరించారు. అంతకుముందు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తిరుమల శ్రీవారిని దర్శించకున్న సీజేఐ తిరుమల శ్రీవారిని సీజేఐ ఎన్వీ రమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయక మండపంలో సీజేఐకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్వామివారి పట్టు వస్త్రాలతో సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని అందించారు.

## సీబీఐ దర్యాప్తును స్వాగతిస్తున్నాం: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వం ఇటీవల కొత్త ఎక్సైజ్ పాలసీని ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ విధానం అమలులో భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఇంట్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా స్పందించారు. తన ట్విట్టర్‌లో అతను రియాక్ట్ అయ్యారు. సీబీఐని స్వాగతిస్తున్నట్లు చెప్పిన కేజ్రీ.. ఆ దర్యాప్తు సంస్థకు పూర్తిగా సహకరించనున్నట్లు వెల్లడించారు. ఈ విచారణ ద్వారా ఏమీ బయటకురాదు అని ఆయన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో సుమారు 20 ప్రాంతాల్లో సోదాలను నిర్వహిస్తున్నారు.ఢిల్లీలో స్కూళ్ల అభివృద్ధి కోసం సిసోడియా ఎంతో చేశారని, ఢిల్లీ ఎడ్యుకేషన్ మోడల్‌ను ప్రశంసిస్తూ అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ పత్రికలో ఇవాళ ఫ్రంట్ పేజీలో కథనం ప్రచురితమైందని, అయితే ఆ రోజునే కేంద్ర ప్రభుత్వం సిసోడియాపై తనిఖీలు చేపట్టడం శోచనీయమన్నారు. గతంలో తమపై ఎన్నోసార్లు సోదాలు జరిగాయని కేజ్రీ అన్నారు.

## సీఎం కేసీఆర్‌కు అంతా శుభమే జరగాలి: దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు

యాదాద్రి: దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామివారిని దర్శించారు. శుక్రవారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న రాఘవేంద్ర రావు.. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు అన్ని శుభాలే జరగాలని ఆకాంక్షించారు. యాదాద్రి దేవస్థానాన్ని ముఖ్యమంత్రి మహాద్భుతంగా పునర్నిర్మించారని చెప్పారు. తాను కొత్తగా సినిమా రూపొందించే ముందు, అదేవిధంగా సినిమా విడుదల సమయంలో స్వామివారిని దర్శించుకుంటానని తెలిపారు. పూర్తి వినోదభరితమైన 'వాంటెడ్ పండుగాడు' అనే సినిమా నేడు విడుదలయిందన్నారు.



# 'పాడా' పనులను త్వరగా పూర్తి చేసేలా సీఎం జగన్ ఆదేశాలు

### 'పాడా' అభివృద్ధి పనులపై సీఎం సమీక్ష

### తాడేపల్లి సమీక్షలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్, ఇతర అధికారులు





పులివెందుల: పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో పులివెందుల ప్రాంతంలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో పాడా అభివృద్ధి పనులపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పులివెందులలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌పై 41వ కిలోమీటరు వద్ద మొగమేరు అక్విడెట్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అలాగే పైడిపాలెం, కుమ్మరంపల్లె గ్రామాలకు చెందిన 535 కుటుంబాల ముంపు బాధితులకు పరిహారం మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, పులివెందుల సిటీ సెంటర్ పనులపై దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. పులివెందుల జగనన్న హౌసింగ్ కాలనీ ఇళ్ల నిర్మాణ ప్రగతిని అధికారులు వివరించగా, నిర్మాణాలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వాటర్‌గ్రిడ్ పనుల పురోగతితోపాటు పులివెందుల మెడికల్ కళాశాల, యూజీడీ, వాటర్ సప్లయ్, బస్టాండు నిర్మాణం తదితర అంశాలపై పనుల పురోగతి గురించి అధికారులు వివరించారు. దీంతోపాటు వేంపల్లె యూజీడీ, డిగ్రీ కళాశాల, గండి ఆలయ అభివృద్ధి పనులు, వైఎస్సార్ మెమోరియల్ గార్డెన్ పనుల పురోగతిని సైతం అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఖరీఫ్, రబీ రెండు సీజన్ల అరటిసాగుకు ఈ?క్రాప్ బుకింగ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప, బద్వేలు, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో పెండింగ్ సమస్యలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థికశాఖ కార్యదర్శులు సత్యనారాయణ, గుల్జార్, ప్రణాళిక విభాగం కార్యదర్శి విజయ్‌కుమార్, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు ఎంపీ గోరంట్ల మాధవ్ సవాల్



అనంతపురం: ఫేక్ వీడియోపై తెలుగుదేశం పార్టీ అనవసరంగా రాద్ధాంతం చేస్తోందని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు అమెరికా నుంచి దొంగ సర్టిఫికెట్ తెప్పించున్నాడని ధ్వజమెత్తారు. టీడీపీ సర్క్యులేట్ చేస్తున్న సర్టిఫికెట్ తాము ఇచ్చింది కాదని ఎక్లిప్స్ సంస్థ ప్రకటించిందని వెల్లడించారు. ఈ మేరకు అనంతపురంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు.'టీడీపీలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఒకసారి ఆలోచించండి. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ చంద్రబాబు. ఓటుకు నోటు కేసుపై ఎల్లో మీడియాలో ఏనాడైనా చర్చలు పెట్టారా?. ముఖ్యమంత్రి పదవి కాపాడుకునేందుకు చంద్రబాబు హైదరాబాద్ నుంచి పారిపోయి అమరావతి వచ్చారు. ఆడపిల్ల కనిపిస్తే ముద్దాయినా పెట్టాలి.. లేదంటే కడుపైనా చేయాలి అన్న బాలకృష్ణ వ్యాఖ్యలపై ఎల్లో మీడియా ఎందుకు చర్చకు పెట్టలేదు?. లోకేష్ అశ్లీల చిత్రాలపై చర్చ ఎందుకు పెట్టరు?. ఫేక్ వీడియో తీసుకొచ్చి బీసీ ఎంపీపై కక్ష సాధిస్తారా?. చంద్రబాబు, ఎల్లో మీడియాది కుల దురహంకారం కాదా?' అంటూ ఎంపీ మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఓటుకు నోటు కేసులో ఆ వాయిస్ తనది కాదని చంద్రబాబు ప్రమాణం చేయగలరా? అని ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రశ్నించారు. పట్టుబడిన రూ.50 లక్షల లంచం తనది కాదని చెప్పగలరా అని నిలదీశారు.చంద్రబాబు మనసూస్ఫర్తిగా కాణిపాకం వినాయకుడి వద్ద ప్రమాణం చేస్తే.. తాను ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. చంద్రబాబుకు దమ్ముంటే సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు.

# జగన్ అక్రమ సంపాదనను వెలికి తీయాలి : యనమల



అమరావతి : ఏపీ సీఎం జగన్ అవినీతి, అక్రమ సంపాదనను వెలికితీసే పనిపై కేంద్రం దృష్టి పెట్టాలని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు డిమాండ్ చేశారు. స్వలాభం, పార్టీ ప్రయోజనాలపైనే దృష్టి సారించారని, వచ్చే ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు వెదజల్లి ప్రజాతీర్పును కాలరాసేందుకే జగన్ రెడ్డి అవినీతి కుంభకోణాలకు అక్రమార్జనకు తెగబడ్డాడని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై కేంద్రం ఇంకెన్నాళ్లు హెచ్చరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కంటే ప్రకటలకే ఏపీ సీఎం జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఏపీలో అధికారంలోకి రాలేననే అనుమానంతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదని ఆరోపించారు. ఉపాధి కల్పన శూన్యమని ఎద్దేవా చేశారు. బాధిత వర్గాల ప్రజలే వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. రాష్ట్రాన్ని సుసంపన్నం చేయడం, ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడంపై జగన్‌కు ఆసక్తి లేదని విమర్శించారు.

## వాయుగుండం కారణంగా ఏపీలో ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్



అమరావతి : వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం కారణంగా రేపు, ఎల్లుండి ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. వాయుగుండం బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముందని వెల్లడించింది. ఈ వాయుగుండం ప్రసుత్తం ఒరిస్సాలోని బాలాసోర్‌కు దగ్గర్లో గంటకు 20 కిమీ వేగంతో వాయివ్యంగా ప్రయాణి స్తోందని సంబంధిత శాఖాధికారులు తెలిపారు. ఈ కారణంగా ఒరిస్సా, ఝార్ఖండ్, చత్తీస్‌ఘడ్, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలతో పాటు ఏపీలోని ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు అవకాశాలున్నాయని స్పష్టం చేసింది . దీంతో విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేసింది .

## సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి.. నెల్లూరు పర్యటనకు సీఎం జగన్

నెల్లూరు(సెంట్రల్): ఆత్మకూరు నియోజకవర్గంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీని ఈనెల 30వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని బుధవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా బ్యారేజీ నిర్మాణం గురించి, దాని రైతాంగం ఎలా లబ్ధిపొందుతుంది తదితర వివరాలను విక్రమ్‌రెడ్డి సీఎం జగన్‌కు వివరించారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనుల గురించి చెప్పారు. ఇంకా చేయాల్సిన వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాను నియోజకవర్గంలో తిరుగుతున్న సమయంలో స్థానిక ప్రజల నుంచి వస్తున్న స్పందన, సంక్షేమ పథకాల లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్న సంతోషాన్ని ముఖ్యమంత్రికి చెప్పారు. త్వరలో బ్యారేజీని ప్రారంభిస్తున్న నేపథ్యంలో జగన్‌మోహన్‌రెడ్డికి విక్రమ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



## దేశంలో మళ్లీ 15 వేలు దాటిన రోజువారీ కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో వరుసగా మూడో రోజూ కరోనా కేసులు పెరిగాయి. మంగళవారం 8 వేలకు తగ్గిన రోజువారీ పాజిటివ్ కేసులు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. గురువారం 12 వేల మందికిపైగా కరోనా నిర్ధారణకాగా, నేడు ఆసంఖ్య 15,754కు చేరింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 4,43,14,618కి పెరిగింది. ఇందులో 4,36,85,535 మంది బాధితులు వైరస్ నుంచి కోలుకున్నారు. ఇప్పటివరకు 5,27,253 మంది కరోనాకు బలయ్యారు. మరో 1,01,830 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కాగా, గత 24 గంటల్లో 47 మంది బాధితులు మహమ్మారి వల్ల మృతిచెందగా, 15,220 మంది కోలుకుని డిశ్చార్జీ అయ్యారని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. రోజువారీ పాజిటివిటీ రేటు 3.47 శాతంగా ఉందని తెలిపింది. మొత్తం కేసుల్లో 0.23 శాతం కేసులు యాక్టివ్‌గా ఉన్నాయని, రికవరీ రేటు 98.58 శాతం, మరణాలు 1.19 శాతంగా ఉన్నాయని పేర్కొన్నది.

# సంపాదకీయం

శనివారం 20-08-2022

## లొసుగులు..నిరంకుశత్వానికి బాటలు

చట్టం, న్యాయం ముసుగులో అన్యాయం రాజ్యమేలడం కంటే మించిన నిరంకుశత్వం మరొకటి లేదని ఫ్రెంచ్ రాజకీయ తత్వవేత్త మాంటెస్క్యూ అంటాడు. దురదృష్టవశాత్తూ మన నేర న్యాయవ్యవస్థలో ఉన్న లొసుగులు చడీచప్పుడూ లేకుండా ఇలాంటి నిరంకుశత్వానికి బాటలు పరుస్తున్నాయి. ఈ పోకడలను సర్వోన్నత న్యాయస్థానం గుర్తించి నిందితులకు బెయిల్ మంజూరు చేసే ప్రక్రియకు సంబంధించి ఒక ప్రత్యేక చట్టం అవసరమని సూచించడం హర్షించదగ్గ విషయం. సీబీఐ అరెస్టు చేసిన సతీందర్ కుమార్ కేసులో నిరుడు జూలైలో ఇచ్చిన తీర్పుపై వివరణనిస్తూ సుప్రీంకోర్టు తాజా సూచన చేసింది. కేవలం అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే నిందితులను జైలుకు పంపాలనీ, ఎక్కువ సందర్భాల్లో బెయిల్ మంజూరు చేయొచ్చనీ, బెయిల్ పొందడం నిందితులకుండే హక్కనీ అనేకానేకసార్లు సుప్రీంకోర్టు తెలిపింది. వలస పాలనను వదుల్చుకుని 75 ఏళ్లవుతున్నా మన అధికార వ్యవస్థలను మాత్రం ఆ జాడ్యం వదలడం లేదు. దర్యాప్తు సంస్థలు జరిపే అరెస్టుల్లో కనీసం 60 శాతం అనవసరమైనవేనని జాతీయ పోలీసు కమిషన్ నివేదిక గతంలో ఒకసారి చెప్పింది. అయినా యథేచ్ఛగా అరెస్టులు సాగుతూనే ఉన్నాయి. కింది కోర్టులు సైతం నిందితులను రిమాండ్‌కు పంపి చేతులు దులుపుకొంటున్నాయి. దేశవ్యాప్తంగా సామాజిక కార్యకర్తలనూ, రాజకీయ నాయకులనూ, పాత్రికేయులనూ అరెస్టు చేయడం, వారు బెయిల్ దొరక్క నెలల తరబడి జైళ్లలో మగ్గడం ఈమధ్యకాలంలో మితిమీరింది. ఇక స్వప్రయోజనాల కోసమో, పెత్తందార్ల ప్రయోజనాలు నెరవేర్చే ఉద్దేశంతోనో అమాయకులను అరెస్టు చేయడం గురించి చెప్పనవసరం లేదు. ఇలాంటివారు ఏళ్లతరబడి జైళ్లలో మగ్గుతున్నారు. ఇందువల్ల పౌర హక్కులకు భంగం కలగడం మాత్రమే కాదు... విచారణలో ఉన్న ఖైదీలతో జైళ్లు కిటకిటలాడుతున్నాయి. అక్కడ సౌకర్యాల లేమితో పరిస్థితి అధ్వాన్నంగా ఉంటున్నది. ఖైదీల్లో మూడింట రెండువంతులమంది విచారణలో ఉన్నవారేననీ, ఇది దారుణమనీ జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం చెప్పవలసి వచ్చిందంటే దేశంలో నేర న్యాయవ్యవస్థ ఎలా ఉందో అర్థమవుతుంది. మన శిక్షాస్మృతి(సీఆర్‌పీసీ) వలస పాలకుల హయాంలో 1882లో రూపొందించింది. స్వాతంత్ర్యానంతరం అలాంటి చట్టాలను పూర్తిగా రద్దు చేసి, మెరుగైన చట్టాలను రూపొందించుకోవాలని పాలకులు ఎన్నడూ అనుకోలేదు. కాలానుగుణంగా సీఆర్‌పీసీకి సవరణలు చేస్తూ పోవడమే పరిష్కార మార్గంగా ఎంచుకున్నారు. 2009లో సీఆర్‌పీసీలోని సెక్షన్ 41ను సవరించారు. అరెస్టు చేసేందుకు పోలీసులకుండే అధికారాలను అది రెండు తరగతులుగా వర్గీకరించింది. ఏడేళ్లు, అంతకన్నా తక్కువ శిక్షపడే అవకాశమున్న నేరాలను 41(బీ) కిందా, అంతకన్నా ఎక్కువ శిక్షపడే అవకాశమున్న నేరాలను 41(బీఏ) కింద విభజించింది. మొదటి కేటగిరీ పరిధిలోకి వచ్చేవారిని అరెస్టు చేయాలంటే అందుకు తగిన కారణాలను రికార్డు చేయాలి. ఆ కారణాలు సహేతుకమైనవో కాదో మేజిస్ట్రేట్‌లు పరిశీలించాలి. వారు సంతృప్తి పడితేనే నిందితుడి రిమాండ్‌కు ఆదేశాలివ్వాలి. 2014లో అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఈ విషయంలో మరింత స్పష్టమైన మార్గదర్శకాలిచ్చింది. ఒక నిందితుణ్ణి అరెస్టు చేసేముందు ఆ చర్య అవసరమో కాదో పోలీసు అధికారి పరిశీలించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు మాత్రమే కాదు, హైకోర్టులు సైతం వివిధ సందర్భాల్లో సూచనలు చేస్తూనే ఉన్నాయి. కానీ పట్టేదెవరికి? ఫలితంగా విచక్షణారహిత అరెస్టులూ, నిందితులు నెలల తరబడి జైలు గోడల వెనక మగ్గడం రివాజుగా మారింది. క్రిమినల్ కేసుల్లో శిక్షలు పడటం అంతంతమాత్రమవుతున్న ధోరణివల్ల కింది కోర్టులు బెయిల్ నిరాకరిస్తున్నాయన్న అభిప్రాయం చాలామందిలో ఉంది. దర్యాప్తు సంస్థలు తమ సామర్థ్యం మెరుగుపరుచుకోవడం, పకడ్బందీ సాక్ష్యాలను సేకరించడం ఈ సమస్యకు పరిష్కారం తప్ప చట్ట నిబంధనలకు విరుద్ధంగా, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు భిన్నంగా వ్యవహరించడం కాదు. కనుకనే ధర్మాసనం మరోసారి దీనిపై దృష్టి సారించాల్సి వచ్చింది. నిందితుడు మరిన్ని నేరాలకు పాల్పడే అవకాశముందని, సాక్ష్యాలను తారుమారు చేయొచ్చని, పరారయ్యే అవకాశముందని సహేతుకంగా భావించినప్పుడు మాత్రమే అరెస్టు చేయాలనీ... ఈ అంశాలన్నింటిలో పోలీసులు సక్రమంగానే వ్యవహరించారని న్యాయస్థానాలు సంతృప్తి పడితేనే నిందితుణ్ణి జైలుకు పంపాలనీ తాజాగా ధర్మాసనం చేసిన సూచనలు ఈ పరిస్థితిని చక్కదిద్దగలిగితే మంచిదే. జీవించే హక్కుకూ, స్వేచ్ఛకూ పూచీ పడుతున్న రాజ్యాంగంలోని 21వ అధికరణ పదే పదే ఉల్లంఘనకు గురవుతుంటే మౌనంగా ఉండటం రాజ్యాంగానికి అపచారం చేసినట్టే. అసలు బెయిల్‌కి సంబంధించి ఒక ప్రత్యేక చట్టం అవసరమని సుప్రీంకోర్టు చేసిన సూచన కూడా శిరోధార్యమైనది. బ్రిటన్‌లో 1976లో ఈ మాదిరి చట్టం వచ్చింది. జైళ్లలో ఖైదీల సంఖ్యను తగ్గించడానికి ఈ చట్టం తీసుకొస్తున్నట్టు అప్పట్లో బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. నేరారోపణలు ఎదుర్కొంటున్నవారికి న్యాయసహాయం అందించే నిబంధనలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ చట్టం అమలు మెరుగైన ఫలితాలనిచ్చిందని అక్కడి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అందుకే సుప్రీంకోర్టు చేసిన సూచనను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. ఈ విషయంలో తగిన ఆలోచన చేయాలి.

# అమాత్యుల అత్యుత్సాహం వెనుక...

తిరుమల, ఆగస్టు 19, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవారి దర్శనానికి రోజూ వేల సంఖ్యలో భక్తులు తిరుమలకు వస్తారు. స్వామివారిని దర్శించుకోవడానికి టీటీడీ వివిధ రూపాల్లో వెసులుబాటు కల్పించింది. అందులో మొదటిది సర్వదర్శనం. దీనికి ఎలాంటి సిఫారసు అక్కర్లేదు. గంటల తరబడి క్యూ లైనులో వేచి ఉండాల్సి వచ్చినా సామాన్య భక్తులు అత్యధిక సంఖ్యలో ఈ విధానంలోనే దర్శనానికి వస్తారు. ఇక రెండోది 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శనం. రోజూ 25 వేల టికెట్స్‌ను ఆన్‌లైన్ విధానంలో వీటిని అందుబాటులో ఉంచుతారు. మూడోది సిఫారసు లేఖలపై దర్శనం. ఇవి కాకూండా వృద్దులు, వికలాంగులు, చంటి బిడ్డల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనం ఉంటుంది. ఎలాంటి సిఫారసు లేఖలు లేకూండా ప్రొటోకాల్ దర్శనం కల్పించే శ్రీవాణి ట్రస్ట్ దర్శనాలు ఉన్నాయి. ఇదంతా బాగానే ఉన్నా.. సిఫారసు లేఖల దర్శనాలను ప్రజాప్రతినిధులు వినియోగిస్తున్న తీరు టీటీడీ ప్రతిష్టను దెబ్బతీస్తోంది. ఇటీవల కాలంలో కొండపై కొందరు మంత్రుల ఓవర్ యాక్షన్ తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖపై ఆరుగురికి వీఐపీ దర్శనం కల్పిస్తారు. మంత్రి స్వయంగా వస్తే 10 మంది వరకు అనుమతి ఇస్తారు. కానీ.. ఈ నిబంధన పాటించడం లేదు కొందరు అమాత్యులు. రద్దీ రోజుల్లో భక్తులు క్యూ లైన్‌లో గంటల తరబడి వేచి చూస్తున్నా.. మంత్రులు పట్టించుకోవడం లేదు. తమతో వచ్చే అనుచరులు అందరికీ వీఐపీ దర్శనం కోసం నానా రచ్చ చేస్తున్నారు. తాజాగా మంత్రి ఉషాశ్రీ చరణ్ అనుచర గణం చేసింది అదే. గతంలో మంత్రులు గుమ్మనూరు



జయరాం.. వేణుగోపాల కృష్ణ, సీదిరి అప్పలరాజు తదితరులు ఇదే విధంగా పెద్ద సంఖ్యలో అనుచరులను దర్శనానికి తీసుకొచ్చారు. ఒకేసారి 60 నుంచి 80 మందిని తమతోపాటు ఆలయం లోకి తీసుకెళ్లే వరకు ఊరుకోలేదు. మంత్రి అప్పలరాజు అయితే ఏకంగా150 మందితో వచ్చి ఆలయం దగ్గర చేసిన యాగి అంతా ఇంతా కాదు. వచ్చిన వాళ్లు అమాత్యులు కావడంతో.. టీటీడీ అధికారులు కూడా కాదన లేకపోతున్నారు. నిబంధనలకు నీళ్లొదిలేస్తున్న పరిస్థితి. కళ్లేదుటే సామాన్య భక్తులు ఇబ్బంది పడుతున్నా మంత్రులకు చీమ కుట్టినట్టు అయినా ఉండదు. తమతోపాటు.. వెంట వచ్చిన అనుచరుల సేవలో టీటీడీ తరిస్తే చాలు అనుకుంటున్నారు. మంత్రి ఉషాశ్రీ చరణ్ తీరు మాత్రం పీక్స్‌కు వెళ్లిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరస సెలవు దినాలకు తోడు పెళ్లిళ్ల సీజన్ కావడంతో తిరుమలలో భక్తుల తాకిడి ఊహించని విధంగా పెరిగిపోయింది. క్యూ లైన్‌లు గోగర్భం డ్యాం వరకు చేరుకున్నాయి. సర్వ దర్శనానికి రెండు రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్య తీవ్రత గమనించిన టీటీడీ.. సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు 21 వరకు సిఫారసు లేఖలపై ఎవిఖ బ్రేక్ దర్శనలను రద్దు చేసింది. ఆ మేరకు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశాలు ఇచ్చారు. సిఫారసు లేఖలపై దర్శనాలనే కదా రద్దు చేశారు.. అందుకే నేనే స్వయంగా కొండకు వస్తున్నా అని టీటీడీకి సమాచారం ఇచ్చారు. మూడు రోజుల వ్యవధిలో రెండోసారి దర్శనానికి వచ్చారు మంత్రి. 10 మంది అనుచరులకు సుప్రభాత సేవ, 50 మంది అనుచరులను తనతోపాటు దర్శనానికి తీసుకెళ్లారు. పైగా ఇంత రష్‌లోనూ కల్యాణదుర్గం ప్రజలకు దర్శనం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పుకొచ్చారు అమాత్యులవారు. సొంత నియోజకవర్గం ప్రజలపై చాలా ప్రేమ చూపించారు సరే.. మరి.. గంటల తరబడి క్యూ లైన్‌లో వేచి ఉన్న సామాన్య భక్తుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి జారుకున్నారు మంత్రి ఉషాశ్రీచరణ్. మొత్తానికి తిరుమల కొండపై మంత్రులు చేస్తున్న హంగామా తీవ్ర విమర్శలు తప్పడం లేదు. అమాత్యుల తీరు టీటీడీకి వివాదాలను తెచ్చిపెడుతోంది.

# కాసులు కురిపిస్తున్న జామ




తిరుపతి, ఆగస్టు 19, ప్రజలకు ఆరోగ్యకరమైన జామ పండ్ల సాగుకు పెనుమూరు ప్రసిద్ధి చెందుతోంది. రైతులు ఏడాదిలో మూడు సార్లు దిగుబడులు సాధిస్తున్నారు. అత్యధిక ఫలసాయం, ఆదాయం ఇచ్చే పంట జామ. ఇతర రాష్ట్రాలు, పట్టణాలకు పెనుమూరు నుంచి జామను రవాణా చేస్తున్నారు. రెండు శతాబ్దాల క్రితం దాసరాపల్లెకు చెందిన నాగిరెడ్డి తొలిసారిగా జామ పంట సాగు చేశాడు. ఆయన జామ సాగులో మంచి లాభాలు పొందడం చూసి దాసరాపల్లెలో ఉన్న 50 కుటుంబాలు జామ పంట సాగు చేస్తున్నారు. దాసరాపల్లెను ఆదర్శంగా తీసుకొని కారకాంపల్లె, పెద్దరాజుపల్లె, ఉగ్రాణంపల్లె, చెళంపాళ్యం, రామాపురం, పెనుమూరు గ్రామాల్లో 150 ఎకరాల్లో వివిధ రకాల జామ సాగవుతోంది. జామ సాగుపై ఉన్న మక్కువతో వారసత్వంగా కూడా రైతులు సాగు చేస్తున్నారు. తొలుత రసాయన ఎరువుల వినియోగంతో జామ సాగు చేశారు. పెట్టుబడి పెరగడంతో కష్టాలు, నష్టాలు చవి చూశారు. మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా జామ సాగు చేస్తున్నారు. సాధారణంగా జామలో ఏడాదికి రెండు పంటలు మాత్రమే దిగుబడి సాధించవచ్చు. అయితే శాస్త్రీయ పద్ధతులతో "చందన మాధురి" రకంతో మూడు పంటలు అందుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య భీజామృతం, పళ్ల ద్రావణం, వేప కషాయం, వానపాముల ఎరువుల వినియోగంతో జామ సాగు చేస్తున్నారు. రైతులు జామ తోటల్లో కోళ్లు, పొట్టేళ్లు పెంచుతూ భూమిని సారవంతం చేస్తున్నారు. వీటితో పాటూ మూడు పర్యాయాలు పచ్చిరొట్ట పైర్లు సాగు చేస్తూ సేంద్రియ ఎరువులు సహజంగా అందిస్తున్నారు. ఏటా భూసార పరీక్షలు చేస్తూ సూక్ష్మపోషకాలు అందిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నారు స్థానికంగా జామ కాయలు విక్రయించడం వల్ల ఆదాయం ఆశాజనకంగా లేదు. దీంతో మార్కెట్ మెలకువలపై రైతులు దృష్టి సారించారు. పల్లెల్లో కన్నా పట్టణాల్లో జామ కాయల ధర, డిమాండ్ ఉండడాన్ని గుర్తించారు. సేంద్రియ ఉత్పత్తులు కొనే సంస్థలను, వ్యాపారులను సంప్రదించి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలకు రవాణా చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. స్థానికంగా ఒక కిలో జామ కాయలు రూ.20 ఉండగా పట్టణాల్లో రూ.80 నుంచి 100 వరకు పలుకుతోంది. వీటితో పాటూ డయాబెటిక్ సెంటర్లకు ప్రత్యేక ప్యాకింగ్‌తో సరఫరా చేస్తున్నారు. అంతే కాకుండా వివిధ పట్టణాల్లో నిర్వహించే ఆర్గానిక్, కిసాన్ మేళాల్లో ఈ దిగుబడులు విక్రయిస్తున్నారు. ఉద్యానవన పంటల్లో ప్రస్తుతం జామ సాగు మంచి ఆదాయాన్నిస్తోంది. పైగా ఈ పంటకు తెగుళ్ల బెడద పెద్దగా ఉండదు. పెట్టుబడులు కూడా తక్కువే. మార్కెట్‌లో విక్రయించుకోవడం సులభంగా ఉంది. అదీకాక ఏడాదికి మూడు పంటలు ఇవ్వడంతో మంచి ఆదాయం పెరుగుతోంది. జామను సేంద్రియ పద్ధతులతో సాగుచేయడం, మార్కెట్ మెలకువలతో అమ్ముకోవడం ద్వారా ఎకరా పంటకు ఏడాదిలో రూ.3లక్షల వరకు నికర ఆదాయం వస్తోంది. కాయలతో పాటూ మొక్కలు అంటుకట్టి కొందరు రైతులు మరింత ఆదాయం పొందుతున్నారు.

# కడపలో శిలాయుగం ఆనవాళ్లు

కడప, ఆగస్టు 19, రాయలసీమ ప్రాంతంలో పురావస్తు ఆనవాళ్లపై యోగివేమన విశ్వవిద్యాలయం చరిత్ర, పురావస్తుశాఖ విభాగం ఆధ్వర్యంలో పరిశోధనలు గత కొంతకాలంగా జరుగుతూనే ఉన్నాయి. ఈ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ రఘుయాదవ్ చేసిన పరిశోధనల్లో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఎథ్నో ఆర్కియాలజిస్టు అయిన ఈయన కర్నూలు జిల్లా కోడుమూరు మండలం, గూడూరు మండలాల సరిహద్దుల్లో వందల సంవత్సరాల క్రితం ధ్వంసమైన సూరబోయిన పాడు (ప్రస్తుతం ప్యాలకుర్తి గ్రామానికి 8 కి.మీ సమీపంలో) అనే పాడుబడిన ప్రదేశంలో నిర్వ హించిన క్షేత్ర పరిశోధనల్లో కొత్తరాతి యుగం నాటి పురావస్తు ఆధారాలు లభించాయి. మొత్తం నల్లరేగడి నేలలో విస్తరించిన ఈ ప్రాంతం వంక ఒడ్డున ఉంది. ఈ వంక తుంగభద్ర నది ఉపనది అయిన హంద్రీనీవలో కలుస్తుంది. ప్యాలకుర్తి గ్రామస్తులు ఈ పరిశోధక ప్రాంతాన్ని 'పాటి' మీదిగా పిలుస్తున్నారు. పూర్వం ఈ ప్రాంతాన్ని సుధారపాడు అని పిలుచేవారని స్థానికుల అభిప్రాయం. కంభంపాటి సత్యనారాయణ గారి ఆంధ్రుల చరిత్ర ?సంస్కృతిలో సూరబోయినపాడుగా పేర్కొన్నారు. ప్యాలకుర్తి, సూరబోయిన పాడు గ్రామాలను నివాసయోగ్యంగా మార్చేందుకు ఇక్కడ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు నాటి విజయనగర సామ్రాజ్యస్థాపకుడు అయి న మొదటి హరిహరరాయలు (క్రీ.శ. 1336? 1356) నరసింహ అనే వ్యక్తికి అధికారం ఇచ్చి నట్లు తెలుస్తోంది. విజయనగర సామ్రాజ్యం ప తనం అనంతరం ఈ గ్రామం శిథిలమై ఉంటుందని.. ఇందుకు సాక్షాలుగా ఇప్పటికీ అక్క డ శిథిలమై ఉన్న శివాలయం, ఆంజనేయస్వా మి గుడి, బుగ్గరామేశ్వరుని గుడి, చౌడమ్మ విగ్రహాలను పరిశోధకులు గుర్తించారు. లభించిన పూసలు ఒక రంధ్రాన్ని మాత్రమే కలిగి ఉన్నాయి. అయితే అవి విభిన్న ఆకారాలను కలిగి ఉన్నాయి. స్థూపాకారం, గుండ్రంగా వలయాకారం, గొట్టపు ఆకారం, పీపా ఆకారంతో ఉన్నాయి.

# నేడు భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి

ఇందిరా గాంధీ, ఫిరోజ్ గాంధీ ల పెద్ద కుమారుడు రాజీవ్ గాంధీ, భారతదేశ 7వ ప్రధానమంత్రి (గాంధీ - నెహ్రూ కుటుంబము నుండి మూడవ వాడు). 1984 , అక్టోబరు 31 న తల్లి మరణముతో ప్రధానమంత్రి అయిన రాజీవ్ 1989 , డిసెంబరు 2 న సాధారణ ఎన్నికలలో పరాజయము పొంది, రాజీనామా చేసే వరకు ప్రధానమంత్రిగా పనిచేశాడు. 40 సంవత్సరాల వయసులో ప్రధానమంత్రి అయిన రాజీవ్ గాంధీ భారత ప్రధానమంత్రి అయిన అతి పిన్న వయస్కుడు. శ్రీలంక దేశానికి చెందిన తమిళ తీవ్రవాదులు(ఎల్.టి.టి.ఈ) చేసిన మానవ బాంబు దాడిలో మరణించాడు. 1944వ సంవత్సరంలో ఇందిరాగాంధీ - ఫిరోజ్‌గాంధీ దంపతులకు పెద్ద కుమారునిగా ఆగస్టు 20,1944న రాజీవ్ గాంధీ జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని డెహ్రాడూన్‌లో పూర్తి చేసిన రాజీవ్, ఉన్నత విద్యాభ్యాసం ఇంగ్లండ్‌లో పూర్తి చేశారు. తరువాతి కాలంలో తను అత్యంత అభిమానించే 'ఫ్లైయింగ్' రంగంలో శిక్షణ పొందిన రాజీవ్‌గాంధీ, ఇండియన్ ఎయిర్ లైన్స్‌లో పైలట్‌గా తన ఉద్యోగజీవితాన్ని ప్రారంభించారు. ఇంగ్లండ్‌లో చదువుతున్న సమయంలోనే రాజీవ్ ఇటాలియన్ యువతి అయిన సోనియాను ప్రేమించడం, తరువాతి కాలంలో పెళ్ళి చేసుకోవడం జరిగింది. మొదట్లో ఇందిరాగాంధీ రాజకీయ వారసుడుగా సంజయ్‌గాంధీనే అని అందరూ భావించారు. అదే విధంగా రాజకీయ వ్యవహారాలలోనూ, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలలోనూ, పరిపాలనా వ్యవహారాలలోనూ సంజయ్‌గాంధీ జోక్యం అధికంగా వుండేది. రాజీవ్‌గాంధీ మాత్రం చిన్ననాటి నుండి రాజకీయాల పట్ల పెద్దగా ఆసక్తి కనబరచేవారు కాదు. అందుకే రాజీవ్ తనకిష్టమైన రంగంలో ప్రవేశించి పైలెట్‌గా ఉద్యోగం చేయనారంభించారు. 1980వ సంవత్సరంలో ఒక ప్రమాదంలో సంజయ్‌గాంధీ మరణించారు. దాంతో ఇందిరాగాంధీ రాజీవ్‌గాంధీని తన రాజకీయవారసునిగా చేయాలని భావించి రాజీవ్‌ను పరిపాలనా వ్యవహారాలలో తనకు తోడుగా వుండమని కోరడం జరిగింది. భార్య సోనియాగాంధీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, తల్లి కోరిక మేరకు రాజీవ్‌గాంధీ రాజకీయరంగ ప్రవేశం చేశారు. 1984వ సంవత్సరం అక్టోబర్ నెలలో తన అంగరక్షకుల చేత ఇందిరా గాంధీ హత్య గావించబడడంతో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాజకీయాల పట్ల ఆసక్తి లేకపోవడంతో చాలాకాలంపాటు రాజకీయాలకు దూరంగా వుండటం, అనుభవం లేకపోవడం వంటి కారణాల వల్ల రాజీవ్‌గాంధీ ఎక్కువ కాలం పరిపాలన సాగించలేడని అందరూ భావించారు. కానీ, వారందరి నమ్మకాలను వమ్ము చేసే విధంగా రాజీవ్ పూర్తికాలం పదవిలో కొనసాగడమేకాక, పరిపాలనా పరంగా పలుమార్పులు తీసుకురావడమేకాక, ఆధునిక రీతికి తగ్గట్లుగా పాలించి అందరి అభిమానాన్ని చూరగొన్నారు రాజీవ్. భారతదేశానికి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన అత్యంత పిన్నవయస్కునిగా చరిత్ర సృష్టించారు రాజీవ్‌గాంధీ. ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంభవిస్తున్న మార్పులకనుగుణంగా భారతదేశాన్ని ముందుకు నడిపించిన సమర్థనాయకుడు రాజీవ్‌గాంధీ. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగ ఆవశ్యకతను, భవిష్యత్తులో అది పోషించబోయే పాత్రను ముందుగానే ఊహించిన రాజీవ్ గాంధీలోని దార్శనికుడు, ఆ రంగానికి ప్రాధన్యమిచ్చాడు. కానీ, 'బోఫోర్స్' కంపెనీ నుండి ఆయుధాలు కొనడంలో భారీ అవకతవకలకు పాల్పడ్డారని అవినీతి ఆరోపణలు రాజీవ్‌గాంధీ



ఎదుర్కోవడం వంటి కారణాల వల్ల 1989వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటమి ఎదుర్కోవలసి వచ్చింది. వి.పి.సింగ్ ప్రధానమంత్రిగా 'జనతాదళ్' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ పూర్తికాలం కొనసాగలేకపోయింది. దాంతో 1991వ సంవత్సరం లో మళ్ళీ ఎన్నికలు రావడం జరిగింది. ఆ ఎన్నికల్లో రాజీవ్ గాంధీకి అనుకూల సూచనలు కనపడ్డాయి. 1991వ సంవత్సరం మే21వ తేదీన తమిళనాడులో 'శ్రీ పెరంబుదూర్' కు ఎన్నికల ప్రచార నిమిత్తం వచ్చిన రాజీవ్‌గాంధీ సభావేదికవైపుగా వెళుతుండగా ఎల్.టి.టి.ఈ 'ఆత్మాహుతిదళం' కు చెందిన మహిళ ఆయనకు దండ వేయడానికి వచ్చి బెల్టుబాంబు పేల్చడంతో రాజీవ్‌గాంధీ అక్కడికక్కడే మరణించారు. రాజీవ్ శరీరం ముక్కలు ముక్కలు కాగా, ఆయన కాలిబూటును బట్టి ఆయన శరీరాన్ని గుర్తించవలసి వచ్చింది. అంతకు ముందు రాజీవ్ ప్రధానిగావున్న సమయంలో శ్రీలంకలో ఎల్.టి.టి.ఈ తో పోరాటానికి భారతసైన్యాన్ని పంపడానికి వ్యతిరేకంగా ఎల్.టి.టి.ఈ టైగర్లు యీ విధంగా రాజీవ్‌గాంధీని హత్యచేసి పగ తీర్చుకున్నారు. రాజివ్ మరణాంతరం భారతదేశ విశిష్ట పురస్కారమైన భారతరత్న అవార్డును కేంద్ర ప్రభుత్వం 1991లో ప్రకటించింది. ఈయన వర్ధంతి రోజైన మే 21నాడు జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుంది.

# అసంతృప్తులకు ఆజ్యం...

కర్నూలు, ఆగస్టు 19, నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని టీడీపీ నేతల్లో నిస్తేజం నెలకొంది. కుటుంబానికి ఒకే టిక్కెట్ ఇస్తామని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడం, అంతర్గత కలహాలను ప్రోత్సహించడంపై టీడీపీ నాయకులు గుర్రుగా ఉన్నారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఫరూక్ కుమారుడు ఫిరోజ్ మధ్య సోషల్ మీడియా వేదికగా వర్గపోరు నడుస్తోంది. 'ఫిరోజ్ యువసేన' పేరుతో సోషల్ మీడియాలో బ్రహ్మానందరెడ్డికి వ్యతిరేకంగా పోస్టులు వైరల్ చేస్తున్నారు. బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు.. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కుటుంబానికి ఒకే టిక్కెట్ ఇస్తామని నేతల అంతర్గత సమావేశాల్లో స్పష్టం చేశారు. దీంతో టీడీపీలో కీలకంగా ఉండే భూమా, కోట్ల, కేఈ కుటుంబాల్లో టిక్కెట్లు ఆశిస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్ భూమా అఖిలప్రియకు ఇస్తే, ఆ కుటుంబానికి రెండో అవకాశం ఇవ్వబోరని, నంద్యాలలో తాను రేసులో ఉండొచ్చని ఫిరోజ్ భావించారు. దీంతో ఇటీవల చురుగ్గా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా బ్రహ్మానందరెడ్డిపై విమర్శలు చేయిస్తున్నారు. భూమా వైఖరితోనే నంద్యాలలో టీడీపీకి ఈ దుస్థితి దాపురించిందని ప్రచారం చేయిస్తున్నారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ టిక్కెట్లు అమ్ముకున్నారని ఆరోపణలు చేయించారు. భూమా వర్గీయులు సైతం ఫిరోజ్ వర్గానికి వ్యతిరేకంగా కౌంటర్ పోస్టులు పెడుతున్నారు. ఇటీవల జరిగిన టీడీపీ క్లస్టర్ మీటింగ్‌లో వేదికపైనే తనను సమావేశానికి ఆహ్వానించలేదని బ్రహ్మానందరెడ్డిపై ఫిరోజ్ అసంతృప్తి వెలిబుచ్చారు. దీనికి స్పందించిన భూమా.. టీడీపీలో విభేదాలు సృష్టించాలని ఎవరు ప్రయత్నించినా ఎదుర్కొంటానన్నారు. ఎమ్మెల్సీ ఫరూక్ కనుసన్నల్లోనే ఫిరోజ్ వ్యవహరిస్తున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. దీనికి తోడు బనగానపల్లె టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి కూడా ఇటీవల ఓ సందర్భంలో "పాలు అమ్ముకునేవారిని చంద్రబాబు ఎమ్మెల్యేను చేశారని" భూమా బ్రహ్మానందరెడ్డిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దీంతో 'భూమా'కు వ్యతిరేకంగా ఫరూక్ ఫ్యామిలీకి బీసీ సహకరిస్తున్నారనే చర్చ కూడా నడుస్తోంది. ఇదిలా ఉండగా దివంగత మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి ముఖ్య అనుచరుడు ఏవీ సుబ్బారెడ్డి సైతం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేస్తానని చెబుతున్నారు. ముగ్గురు నేతల మధ్య విభేదాలు పెరిగిపోవడంతో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పార్టీలో ఉండలేక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి భూమా, కేఈ కుటుంబాలు జిల్లాలో అత్యంత కీలకంగా వ్యవహరించాయి. భూమా కుటుంబం టీడీపీ వీడిన తర్వాత కేఈ కుటుంబ పెత్తనం నడిచింది. 2019 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పచ్చ కండువా వేసుకున్నారు.

# కర్నూలు నగరంలో అర్ధరాత్రి నాకా బందీ

కర్నూలు కర్నూలు నగరంలో గురువారం అర్ధరాత్రి నాకా బందీ, ఆకస్మిక తనిఖీలను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్చేసారు. గస్తీ సిబ్బంది పనితీరును అయన ఆరా తీసారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా రహదారులపై తిరుగుతున్న పలువురి వాహనాలను ఆకస్మికంగా ఆపి తనిఖీ చేయించారు. కర్నూలు నాలగవ పట్టణ పోలీసుస్టేషన్ , కర్నూలు రెండవ పట్టణ పోలీసుస్టేషన్ , కర్నూలు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ , కర్నూలు మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధులలోని కృష్ణా నగర్ , గుత్తి పెట్రోల్ బంక్, ఆర్ ఎస్ రోడ్డు, రైల్వే స్టేషన్, బంగారు పేట, కల్లూరు దర్వాజ , గణేష్ నగర్, జోహారాపురం, బుధవార పేట, వినాయక్ ఘాట్, సి.క్యాంపు లలో అయన ఆకస్మికంగా పర్యటించి తనిఖీలు నిర్వహించారు. నేరాల నివారణకు రాత్రి పూట గస్తీ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులను తనిఖీలు చేయాలి. రాత్రి గస్తీని ముమ్మరం చేయాలి. న్నారు. రాత్రి గస్తీలు సక్రమంగా నిర్వహిస్తే దొంగతనాలను అరికట్టవచ్చని సూచించారు.విధి నిర్వహణలో సిబ్బంది క్రమశిక్షణతో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పాటు కర్నూలు పట్టణ డిఎస్పీ మహేష్, సిసియస్ డిఎస్పీ శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, కర్నూలు నాలగవ పట్టణ సిఐ శంకరయ్య, కర్నూలు త్రీ టౌన్ సిఐ తబ్రేజ్ , ఫోర్త్ టౌన్ ఎస్సై రామయ్య, కర్నూలు టు టౌన్ ఎస్సై ఖాన్ ఉన్నారు

# టెక్కలిలో రాజకీయ వేడి



శ్రీకాకుళం, ఆగస్టు 19, శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో రాజకీయ వేడి రగులుతోంది. ఇక్కడ ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఎమ్మెల్యే. టీడీపీకి బలమైన కేడర్ కూడా ఉంది. వైసీపీలో అంతర్గత విభేదాలు.. అధికారపార్టీలో గ్రూపు రాజకీయాలు ఎక్కువ. నేతలకు అస్సలు పొసగదు. అలాంటిది ఈ మధ్య కాలంలో వైసీపీ నేతలు ఐక్యతారాగం టీడీపీ శిబిరాన్ని కలవర పెడుతోందట. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పటికీ ఉప్పు నిప్పులా నాయకుల మధ్య మంత్రి బొత్స సత్యనారాయణ సయోధ్య కుదిర్చినట్టు టాక్. బొత్స ఇంఛార్జ్‌గా వచ్చాక.. చాలా మార్పు కనిపిస్తోందట. ఆ మార్పే అచ్చెన్న అండ్ టీమ్‌ను ఉలిక్కి పడేలా చేస్తోందట. రిపేర్ వర్క్ స్టార్ట్ చేసినట్టు సమాచారం.కేడర్ నిస్తేజంగా ఉండటంతోపాటు.. తన కాళ్ల కిందకే నీళ్లు వస్తున్నాయని అచ్చెన్న కలవర పడుతున్నారట. ఏపీ టీడీపీ అధ్యక్షుడైన తర్వాత టెక్కలిలో పార్టీ వ్యవహారాలను ద్వితీయశ్రేణి లీడర్స్‌కు అప్పగించారట. ఆయన విజయవాడలోనే ఎక్కువగా ఉంటున్నారు. దీంతో లీడర్ దూరమై.. కేడర్ కూడా కార్యక్రమాలను లైట్ తీసుకుంది. స్థానిక సమస్యలపై స్పందించేవారే కరువయ్యారు. పైగా అచ్చెన్నకు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం ఎక్కువైంది. దీంతో అందరినీ పిలిచి క్లాస్ తీసుకున్నారట అచ్చెన్న.1983 నుంచి కింజరాపు ఫ్యామిలీదే టెక్కలిలో హవా. అప్పట్లో హరిశ్చంద్రపురం నియోజకవర్గంగా ఉన్నప్పటి నుంచీ ఎర్రన్నాయుడు మొదలుకొని.. ఇప్పుడు అచ్చెన్నాయుడు వరకు గెలుస్తూ వస్తున్నారు. ఒకటి రెండు సందర్భాలలో మినహా మిగతాసార్లు టీడీపీదే గెలుపు. అలాంటిచోట పార్టీ కార్యక్రమాల నిర్వహణకు తెలుగు తమ్ముళ్లు వెనకడుగు వేయడం.. అచ్చెన్న బృందానికి మింగుడు పడటం లేదట. టెక్కలి టౌన్ సహా మండలంలోనూ నాయకత్వం లోపం ఉందని గుర్తించారట. నియోజకవర్గంలో టీడీపీ నేతలు నాలుగు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం మొదలుపెట్టారు. అటు వైసీపీ ఐక్యత రాగం..ఇటు టీడీపీలో విభేదాలు ఏపీ టీడీపీ చీఫ్‌కు నిద్ర లేకుండా చేస్తున్నాయట.సమస్యను ఆలస్యంగా గ్రహించిన అచ్చెన్నాయుడు.. దిద్దుబాటు చర్యలైతే ప్రారంభించారు. మండలాల వారీగా పార్టీ నేతలను పిలిచి మాట్లాడుతున్నారు. చెప్పాల్సిన వారికి సుతిమెత్తంగా చెబుతున్నారు.. మందలించాల్సిన వాళ్లకు అదే టోన్‌లో హెచ్చరికలు పంపుతున్నారట. ఇన్నాళ్లుగా ఒక టీమ్‌లా పనిచేసిన టీడీపీ నేతలకు ఏమైంది అన్నది పెద్ద ప్రశ్న. అందుకే అచ్చెన్న ప్రయత్నాలు వర్కవుట్ అవుతాయా? లేక వైసీపీ నేతల ఐక్యత పైచెయ్యి సాధిస్తుందా అన్నది చర్చ. మరి.. రానున్న రోజుల్లో టెక్కలి రాజకీయం ఎలాంటి మలుపు తీసుకుంటుందో చూడాలి.

# 13 రాష్ట్రాల్లో విద్యుత్ సంక్షోభం

న్యూఢిల్లీ 13 రాష్ట్రాల్లో విద్యుత్ సంక్షోభం ఏర్పడుతుంది. రాష్ట్రాలన్నీ భారీ బకాయిలు పడ్డాయని, చెల్లించకపోతే విద్యుత్ సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఈమేరకు ప్రభుత్వ యాజమాన్యంలోని పవర్ సిస్టమ్ ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ 13 రాష్ట్రాల్లోని 27 పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల పవర్ ట్రేడింగ్‌ను నిషేధించాలని మూడు పవర్ ఎక్స్ఛేంజీలు అయిన ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, పవర్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా, హిందూస్తాన్ పవర్ ఎక్స్ఛేంజ్‌లను కోరింది.ఈ పంపిణీ సంస్థలకు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి భారీ బకాయిలు ఉన్నాయి. లిస్టులో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు ఉన్నాయి.విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పోసోకో దేశంలో విద్యుత్ వ్యవస్థ సమగ్ర కార్యాచర ణను నిర్వహిస్తుంది. ఈ మేరకు మూడు పవర్ మార్కెట్‌లకు రాసిన లేఖలో, "13 రాష్ట్రాల్లోని 27 డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు అన్ని విద్యుత్ మార్కెట్ ఉత్పత్తులను కొనడం–అమ్మడం/డెలివరీ చేయడం 2022 ఆగస్టు 19 నుంచి తదుపరి నోటీసు వచ్చే వరకు ఖచ్చితంగా నిషేధించాలి'' అని పేర్కొంది.చెల్లింపు భద్రతా వ్యవస్థ కింద, ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలను ఉత్పత్తి చేసే కంపెనీలకు బకాయి లు చెల్లించనందుకు విద్యుత్ మార్కెట్‌లో వ్యాపారం చేయకుండా నిషేధించవచ్చు. దీని కింద, తగినంత చెల్లింపులు చేస్తే లేదా ముంద స్తు చెల్లింపు చేస్తేనే విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలుస్తుంది. లేదంటే మాత్రం ఈ రాష్ట్రాల్లో చీకట్లు కమ్ముకోనున్నట్లు తెలుస్తోం ది.తెలంగాణ రూ. 1380 కోట్లు, తమిళనాడు రూ. 924 కోట్లు రాజస్థాన్‌రూ.500కోట్లు,జమ్మూకాశ్మీర్‌రూ.434 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ. 412 కోట్లు, మహారాష్ట్ర రూ. 381 కోట్లు, చత్తీస్ఘడ్ రూ. 274కోట్లు, మధ్యప్రదేశ్ రూ. 230 కోట్లు, ఝార్ఖండ్ రూ. 214 కోట్లు, బీహార్ రూ. 172 కోట్లుగా తేలింది. అయితే, తెలంగాణను ఇబ్బంది పెట్టాలని కేంద్రం నిర్ణయం తీసుకుందంటూ తెలంగాణ విద్యుత్ సంస్థలు ఆరోపణలు కురిపిస్తున్నాయి. తెలంగాణ విద్యుత్ బకాయిల విషయం హైకోర్టులో ఉందంటూ చెప్పుకొచ్చాయి.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత

కమాన్ పూర్ కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామానికి చెందిన చొప్పరి రమ , గోస్కుల మెండయ్య లు ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేసుకోగా చొప్పరి రమ కు 20,000 /– రూ మరియు గోస్కుల మెండయ్య కు 9,000 /– రూ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాగా ఇట్టి సీఎంఆర్ఎఫ్ చెక్కులను జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు టీఆర్ఎస్ పార్టీ కమాన్ పూర్ మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గుండారం వద్ద లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును టీఆర్ఎస్ పార్టీ నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ మండల ఎంపీపీ రాచకొండ లక్ష్మి , కమాన్ పూర్ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి ,మండల కో ఆప్షన్ మెంబర్ ఎండీ. ఇంతియాజ్ , గుండారం ఉప సర్పంచ్ రాచకొండ చంద్రమౌళి , మండల టీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్ , గుండారం టీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దండే కిషన్ , గుండారం టీఆర్ఎస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు సిరవేణి వేణు , టీఆర్ఎస్ పార్టీ నాయకులు రాచకొండ రవి , ఆకుల గట్టయ్య ,దామెర సంపత్ , దండే రమేష్ ఠాగూర్,బోయినిబాలకృష్ణ ,పిడుగు అంజి,బొల్లపల్లిశంకర్ గౌడ్ జంగిలిఅంజి,సింగంశ్రీనివాస్,దండే కనకయ్య ,పోల్దాసరిరవి, గోగుల మల్లయ్య , అడువాలమధునయ్య,కందులమధు,పిట్టలస్వామి,పోల్దాసరిశేఖర్,దండే ప్రదీప్,బొంగానిఅనిల్,ఆకులరాజం,తదితరులు పాల్గొన్నారు


# చంద్రగిరిలో కనిపిస్తున్న నైరాశ్యం

తిరుపతి, ఆగస్టు 19, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి బాస్కర్ రెడ్డి. ఎమ్మెల్యేగా వరసగా రెండుసార్లు గెలిచి లోకల్‌గా పట్టుసాధించారు. ఆయనలానే కేడర్ కూడా దూకుడే. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సైతం భాస్కరరెడ్డి పిలుపు ఇస్తే చాలు కేడర్ వాలిపోయేది. అలాంటి చంద్రగిరి వైసీపీలో ప్రస్తుతం ఎక్కడ చూసినా నైరాశ్యం కనిపిస్తోందట. మునుపటి జోష్ లేదన్నది పార్టీ వర్గాలు చెప్పేమాట. వైఎస్ఆర్ వర్ధంతి.. జయంతి.. సీఎం జగన్ పుట్టినరోజు.. వైసీపీ ప్లీనరీలు ఇలా కార్యక్రమం ఏదైనా గతంలోలా ఉత్సాహంగా పాల్గొనలేదని చంద్రగిరిలో అధికారపార్టీ శ్రేణులు కోడై కూస్తున్నాయి.పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో ఎమ్మెల్యేకు.. పార్టీ కేడర్‌కు మధ్య మొదలైన దూరం ప్రస్తుతం చాలా పెరిగిందట. మొదటి నుంచి వైసీపీ జెండా భుజానకెత్తుకున్న వారిని కాదని కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవులు కట్టబెట్టడం సమస్య తెచ్చిపెట్టిందని టాక్. పదవులు పొందినవాళ్లు వాటిని అలంకార ప్రాయంగా చూస్తున్నారే తప్ప ఇతర కార్యక్రమాలేవీ పట్టించుకోవడం లేదట. ఇంకొందరు తమకు ఇష్టం లేని పోస్టులు ఇచ్చారని మౌనంగా ఉంటున్నారట. ఇలా ఎవరికి వారు తమకున్న సమస్యలతో మౌనవ్రతం పాటిస్తూ గ్యాప్ మెయింటైన్ చేయడం చర్చగా మారింది.అయితే కేడర్ ఏవిషయంలోనైనా భయపడుతుందా అనే ప్రశ్నలు ఉన్నాయట. కరోనా సమయంలో ఆనందయ్య మందులు పంపిణీని భారీ ఎత్తున చేపట్టారు ఎమ్మెల్యే చెవిరెడ్డి. మూడు రాజధానులకు మద్దతుగా నారావారి పల్లెలో భారీ కార్యక్రమం చేపట్టి చర్చల్లో నిలిచారు. ఆ తర్వాతే సీన్ మారిపోయింది. ఏ కార్యక్రమం చేపట్టినా.. అధికారులు.. వేళ్లపై లెక్కపెట్టే నేతలు తప్ప పెద్దగా ఎవరూ ముందుకు రావడం లేదట. చివరకు ఎమ్మెల్యే కార్యాలయంలోనూ సందడి లేదని చెవులు కొరుక్కుంటున్నారు.చంద్రగిరి వైసీపీలో వర్గపోరు ఎక్కువైందనే వాదనా ఉంది. అలాగే చేసిన పనులకు బిల్లులు రాక కొందరు.. అప్పులు చేసి వడ్డీలకు వడ్డీలు కట్టలేక మరికొందరు ఆర్థికంగా నలిగిపోతున్నారట. ఆ విషయాన్ని బయటకు చెప్పుకోలేక.. మింగలేక కక్కలేక ఉన్నారట. అందుకే ఎమ్మెల్యేతోనూ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. ఇటీవల కాలంలో వచ్చిన ఉపఎన్నికల హడావిడిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఉండిపోవడం కూడా సమస్య తీవ్రతను పెంచిందనే అభిప్రాయం కొందరు నేతల్లో ఉందట. ఆలస్యంగానైనా సమస్య ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో ఆయన ఉలిక్కి పడ్డారట. ఇలాగే వదిలేస్తే.. చంద్రగిరిలో పట్టుకోల్పోతామనే ఆందోళనతో పరిస్థితులు చక్కదిద్దే పనిలో పడ్డారట.అసంతృప్తితో ఉన్న చంద్రగిరి వైసీపీ నేతల జాబితాను సిద్ధం చేసినట్టు సమాచారం. అలాగే పదవుల విషయంలో ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నాయో.. వ్యక్తం చేశారో తెలుసుకుంటున్నారట. వారితో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దే పనిలో ఉన్నారట. మరి.. ఈ ప్రయత్నాలు ఎమ్మెల్యే చెవిరెడ్డికి ఏ మేరకు అక్కరకు వస్తాయో.. కేడర్ ఎంత వరకు సంతృప్తి చెందుతుందో చూడాలి.

## వీఆర్ఏలకు సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ తల్లికి వినతిపత్రం

వేములవాడ స్థానిక తెలంగాణ చౌక్ లోని వీఆర్ఏల సమ్మె 26వ రోజుకు చేరిందివీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక తెలంగాణ చౌకు వద్ద తెలంగాణ తల్లికి వినతి పత్రాన్ని సమర్పించారుఈ సందర్భంగా వీఆర్ఏల జేఏసీ చైర్మన్ పైన చందు కో చైర్మన్ నరసింహారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారం అర్జున్ మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారువీఆర్ఏల సమస్యలను పరిష్కారం కోరుతూ నేటికీ సమ్మెలోకి వెళ్లి 26 రోజులు కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు 23 వేల వీఆర్ఏల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు వీఆర్ఏలకు ఇచ్చే 10,500 ఏమాత్రం సరిపోవని వీఆర్ఏలు గ్రామాలు 36 డిపార్ట్మెంట్లకు పైగా సహకరిస్తున్నారని అదే కాకుండా రెవెన్యూ పనులు అనేకం ఉంటున్నాయని దానికి అనుగుణంగా వీఆర్ఏలకు వేతనం లేదని కావున వీఆర్ఏలకు పే స్కేలు ఇవ్వాలని డిమాండ్ చేశారులేనిపక్షంలో వీఆర్ఏల పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు నేడు శనివారం రోజున వేములవాడ కేంద్రంగా స్థానిక కోరుట్ల బస్టాండ్ నుంచి తెలంగాణ తల్లి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పే స్కేలు జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీనాయకులు.సిలివేరి ప్రవీణ్ చొప్పరి తిరుపతి భగవాన్ రాజు.రాజేందర్ దేవేందర్ సుజాత స్రవంతి లావణ్య రాజలింగం మహేష్ నరేష్ రవి సాగర్ అబ్బాస్ వందమంది వీఆర్ఏలు పాల్గొన్నారు

# తెలంగాణ కాంగ్రెస్‌లో ఏం జరుగుతుంది



హైదరాబాద్, ఆగస్టు 19, మునుగోడు ఉపఎన్నిక.. కాంగ్రెస్‌లో అంతర్గత పోరు హీట్ మీద ఉన్న సమయంలో పార్టీ హైకమాండ్ ఇద్దరు కాంగ్రెస్ కార్యదర్శులను రాష్ట్రానికి పంపింది. గతంలో ఇక్కడ పనిచేసిన కాంగ్రెస్ కార్యదర్శి శ్రీనివాస కృష్ణన్ వెళ్లిపోవడంతో.. ఆయన ప్లేస్‌లో ఇద్దరు వచ్చారు. కొత్తగా నదీం జావెద్.. రోహిత్ చౌదరిలను ఎంపిక చేసి.. తెలంగాణకు పంపడం వెనక పార్టీ పరంగా పెద్ద వ్యూహమే ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.నదీం.. రోహిత్ ఇద్దరూ గతంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీతో కలిసి పనిచేశారు. ప్రియాంక కోటరీలో నమ్మకస్తులుగా ముద్ర ఉంది. సమన్వయ కర్తలుగా సమర్థంగా పనిచేస్తారని రాహుల్ గాంధీకి కూడా గురి ఉందట. వీరిద్దరికీ ప్రియాంక, రాహుల్ గాంధీలు 45 రోజులు గడువు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో పరిస్థితిని చక్కదిద్దేందుకు అగ్రనేతలు స్వయంగా ఎంట్రీ ఇచ్చి.. కాంగ్రెస్ కార్యదర్శులను హైదరాబాద్‌లో ల్యాండ్ చేయించారని టాక్.తెలంగాణ కాంగ్రెస్‌లో ఏం జరుగుతుంది? ఎవరు చెప్పేది నిజం? గ్రౌండ్‌లో పరిస్థితి ఏంటి? అనే అంశాలపై ఇద్దరు కాంగ్రెస్ కార్యదర్శులు నదీం.. రోహిత్‌లు హైకమాండ్‌కు నివేదికలు ఇస్తారని సమాచారం. ఈ విషయంలో ప్రియాంకా గాంధీ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారట. నియోజకవర్గాల వారీగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు నేతలు.. పని కూడా మొదలుపెట్టేశారు. ఖఎఖీ కుమారుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణుతో నదీంజావెద్ భేటీ అయ్యారు. కొద్దిరోజులుగా విష్ణు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆపై పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీతోనూ నదీం జావెద్ సమావేశం అయ్యారు. పార్టీ వ్యవహారాలు.. అంతర్గత అంశాలు.. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మాణిక్యం ఠాగూర్ పనితీరుపై నదీం ఆరా తీస్తున్నారట.మరో కాంగ్రెస్ కార్యదర్శి రోహిత్ చౌదరి సైతం రాష్ట్రంలో పార్టీ పరిస్థితిని ఆకళింపు చేసుసుకునే పనిలో పడ్డారు. త్వరలోనే ఫీల్డ్ ఎంట్రీ ఇస్తారట. దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉంది హైకమాండ్ భావిస్తోంది. అందుకే ఇక్కడి వ్యవహారాలను ప్రియాంకా గాంధీ స్వయంగా పర్యవేక్షిస్తారని చర్చ జరుగుతోంది. అందుకే ఆమె టీమ్‌లో కీలకంగా ఉన్న ఇద్దరిని తెలంగాణ పంపినట్టు చర్చ సాగుతోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితితోపాటు.. పార్టీ నేతల్లో ఎవరేంటి? వివాదాలు ఎక్కడ నుంచి వస్తున్నాయి? తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పార్టీ ఎందుకు పుంజుకోలేదు? 2014, 2018 ఎన్నికల ఫలితాలు.. 2018 తర్వాత జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పనితీరు. పీసీసీకి కొత్త సారథ్యం వచ్చాక జరిగిన కార్యక్రమాలు.. నేతల అలకలు.. అసంతృప్తులు.. ఆరోపణలు.. విమర్శలపైనా ఫోకస్ పెడతారని తెలుస్తోంది. అసలు కాంగ్రెస్‌లో ఈ పంచాయితీలు ఏంటి? వీటి వెనక ఎవరు ఉన్నారు? ఇలా అన్ని అంశాలను 45 రోజుల్లో వడపోసి.. పూర్తి స్థాయి అధ్యయనం నివేదికను హైకమాండ్‌కు అందజేస్తారట.

# ఇంద్రకీలాద్రిలో పోటెత్తిన భక్తులు




విజయవాడ శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం కావడంతో ఇంద్రకీలాద్రి పై భక్తులు పోటెత్తారు. భారీ ఎత్తున అమ్మవారిని దర్శించుకొని తరిస్తున్నారు. నాల్గవ శుక్రవారం కావడంతో అమ్మవారి మహామండపంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మత్తయిదలు అమ్మవారి కి పూజాది కార్యక్రమాలు నిర్వహిం చారు. సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. దుర్గగుడి ఈవో భ్రమరాంబ మాట్లాడుతూ అమ్మవారి చెంత వరలక్ష్మి దేవి వ్రతాలకు అనూహ్య స్పందన వచ్చింది. దాదాపు 500 మంది కి పైగా మహిళా భక్తుకు వ్రతం నిర్వహిస్తున్నారు. అప్లికేషన్స్ లేనివారిని వ్రతానికి అనుమతించాం. అమ్మవారి అనుగ్రహం ప్రతిఒక్కరిపై ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

## ఘనంగా గణపతి రాఘవులు జన్మదిన వేడుకలు...

అంబాజీపేట, ఆగస్టు 19 మాజీ సొసైటీ అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గణపతి వీర రాఘవులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అయన స్వగృహం లో శుక్రవారం టీడీపీ నాయకులు అయన అభిమానులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.జిల్లా పార్లమెంట్ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి చిన్నం బాల విజయరావు ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక వీరభద్ర శర్మ (బుల్లియ్య) ఆధ్వర్యంలో రాఘవులు చే కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.దుశ్శవాలు తో ఘనంగా సత్కరించారు మాజీ జడ్పీటీసీ బొంతు పెదబాబు టీడీపీ ప్రధాన కార్యదర్శి గుడాల ఫణి నాయకులు పెంద్ర రమేష్ రవణం రాము మేడిద శ్రీను రవణం రాము గుత్తుల చంటి మంద రాజేష్ మోకా శ్రీనివాసరావు కాగిత వీర వెంకట సత్యనారాయణ కొయ్యప వెంకటేశ్వరరావు యాగన పండు చిక్కం పల్లంరాజు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా బుల్లియ్య సమకూర్చిన బట్టలను పేదలకు పంపిణీ చేశారు.



## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఆనందం నింపిన శ్రీకృష్ణ జన్మష్టమి వేడుకలు

వేములవాడ వేములవాడ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ జగద్గురు శ్రీకృష్ణ జన్మష్టమిసందర్భంగా వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దాదాపు 100 విద్యార్థిని విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఉట్టి కార్యక్రమం, కోలాటం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులను కృష్ణుడు, గోపికల అలంకరణ చేసిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పిల్లలు వేషధారణలో నృత్యాలు చేసి ఆటపాటలతో గడపడంతో సంతోషకరమైన వాతావరణం చోటు చేసుకున్నాయన్నారు.ప్రతి ఒక్క పండుగ విశిష్టత పాఠశాలలోని విద్యార్థులకు తెలియజేయాలనే ప్రతి పండుగలను పాఠశాలలోని విద్యార్థులతో జరిపించడంతో వారిలో నూతన ఉత్తేజం పెంపొందుతుందని అన్నారు.పాఠశాల డైరెక్టర్ సన్నిధి వేంకటకృష్ణ , ఇన్చార్జ్ అనిల్ఉపాధ్యాయులబృందాన్ని అభినందించారు.

# ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం– పనీడా త్రినాధ్



నర్సాపురం, ఆగస్టు 19:.:ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని సీనియర్ జర్నలిస్ట్ పండా త్రినాధ్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సుధీర్ఘ కాలంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా పనిచేసి సంఘం అభివృద్ధికి, జర్నలిస్ట్ ల సంక్షేమం నకు తమ వంతు సేవలాందించినట్లు తెలిపారు. నేటితో పాత కమిటీ రద్దు అయ్యిందని కొత్త కమిటీ ఏర్పాటుకు ఒక కమిటీని నియమించిన విషయాన్నీ ప్రకటించారు. సీనియర్ జర్నలిస్ట్ లు నలుగురుతో కూడిన కమిటీ ని ఏర్పాటు చేశామని, సభ్యులు జాబితా, ఎన్నికలు నియమావలి తదితర నిబంధన లతో కూడిన నివేదికను ప్రెస్ క్లబ్ కు సమర్పిస్తారని వివరించారు. కొత్త కమిటీ ఎన్నికకు, భవిష్యత్ రోజుల్లో ఉపయోగ పడేవిధంగా నియమ నిభందనలు రూపొందించనున్నట్లు చెప్పారు. వచ్చే శనివారం తో ఈ పక్రియ పూర్తి అవుతుందని, ఆదివారం ప్రెస్ క్లబ్ కు కొత్త కమిటీ నియామకం జరుగుతుంది అని వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ మురళి మాట్లాడుతూ జర్నలిస్ట్ లకు సంఘములో ఉన్న గౌరవంను నిలబెట్టుకోవాలని, సీనియర్స్ జూనియర్స్ కు ఆదర్శంగా నిలవాలని పిలుపు నిచ్చారు. ప్రెస్ క్లబ్ నూతన కమిటీ నియామకం పక్రియ ప్రశాంతంగా జరిగేలా సభ్యులంతా సహకరించాలని కోరారు. వర్గ విభేదాలకు తావివ్వకుండా అందరు కుటుంబసభ్యులుగా కలిసి మెలిసి ఉండాలని సూచించారు. సీనియర్ జర్నలిస్టు నీలకంఠం, నాగమల్లేశ్వరరావు, కుమార్, మారుతీ, వెంకటేశ్వరరావు, రాంబాబు, ఇశ్రాయేలు, చిన్నారావు, సూర్యనారాయణ తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు విభేదాలకు తావివ్వకుండా అందరు కుటుంబసభ్యులుగా కలిసి మెలిసి ఉండాలని సూచించారు. సీనియర్ జర్నలిస్టు నీలకంఠం, నాగమల్లేశ్వరరావు, కుమార్, మారుతీ, వెంకటేశ్వరరావు, రాంబాబు, ఇశ్రాయేలు, చిన్నారావు, సూర్యనారాయణ తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ లు నీలకంఠం, నాగమల్లేశ్వరరావు, మారుతీ, కుమార్ లను ఎన్నికల నియామావళి కమిటీ గా వ్యవహరించనున్నారు. ఈ సమావేశంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవినీతికి అడ్డా నంద్యాల పురపాలక సంఘం




## సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా

నంద్యాల :-నంద్యాల జిల్లా స్థానిక యస్ డి పి ఐ . పార్టీ ఆఫీసు నందు శుక్రవారం నాడు మీడియా సమావేశంలో నిర్వహించారు. యస్ డి పి ఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా మాట్లాడుతూ నంద్యాల పురపాలక సంఘంలో గత 2014 నుండి టౌన్ ప్లానింగ్ అధికారులు నూతనంగా నిర్మించే భవనాలకు వేసే 14% అవకతవకలు చేసి అవినీతికి పాల్పడుతూ దాదాపుగా 7.5 కోట్ల రూపాయలు అవినీతి అక్రమణాలకు పాల్పడడం జరిగిందని అన్నారు. నంద్యాల పురపాలక సంఘంలోని ప్రజాధనాన్ని అవినీతి అక్రమాలు చేసి అవినీతికి పాల్పడిన టౌన్ ప్లానింగ్ అధికారులపై వెంటనే సమగ్ర విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నంద్యాల అసెంబ్లీ కార్యదర్శి అన్వర్ భాష మాట్లాడుతూ నంద్యాల పురపాలక సంఘంలో ఇదివరకు కూడా కొన్ని ముఖ్యమైన పత్రాలు , బిల్లులు కాలిపోవడం జరిగిందన్నారు. అదేవిధంగా నంద్యాల సచివాలయ ఉద్యోగస్తులకు వేసే జీతాల ప్రక్రియలో కూడా అసిస్టెంట్ కమిషనర్ , మేనేజర్ గార్ల సంతకాలు లేకుండా జీతాలు వారి అకౌంట్లో వేయడం మరియు కొంతమంది సచివాలయ ఉద్యోగస్తులు వారు డ్యూటీ కి రాకున్నా లీవ్ లో ఉన్నా కూడా వారికి కూడా వారి అకౌంట్ లలో జీతాలు వేయడం జరిగింది వీటన్నింటినీ గమనిస్తే నంద్యాల పురపాలక సంఘం అవినీతి అడ్డగా మారిందని దోజమెత్తారు. నంద్యాల అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కరీముల్లా మాట్లాడుతూ ప్రజల ద్వారా ఇంటి పన్ను , కొళాయి పన్ను , ఇతర పన్నుల ద్వారా చివరికి చెత్త పై కుడా పన్నులు వసూలు చేసి వచ్చిన ఆదాయాన్ని ఈ విధంగా అవినీతి అక్రమాలకు పాల్పడడం పై తీవ్రంగా ఖండించడం జరిగింది. అవినీతి రహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దుతానని చెప్పిన సీఎం జగన్ మోహన్ రెడ్డి మున్సిపాలిటీ ఆదర్శ పురపాలక సంఘంగా తీర్చిదిద్దామని చెప్పిన నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నంద్యాల పురపాలక సంఘంలో ఇంతటి అవినీతి అక్రమాలు జరుగుతున్నా కూడా వాటిపై స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. 2014 నుండి జరుగుతున్న అవినీతి అక్రమణాలపై ప్రతిపక్ష పార్టీ అయినా టిడిపి కూడా వీటిపై నోరు మెదపకపోవడం స్పందించకపోవడం చాలా దారుణమని కావున ఈ అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన అధికారులపై సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మజీద్ ఖాన్. దాదా పీర. అబ్దుల్ రజాక్. సన వుల్లా పాల్గొన్నారు.

# బద్వేలులో వైభవంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

## ముఖ్యఅతిథిగా హాజరైన ఆడ చైర్మన్ సింగసాని గురు మోహన్



బద్వేలు, బద్వేల్ లో శుక్రవారం శ్రీకృష్ణ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి స్థానిక నెల్లూరు రోడ్డు లోని శ్రీకృష్ణ ఆలయంలో యాదవ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు వేడుకల్లో వందలాది మంది భక్తులు కుటుంబాలు హాజరయ్యారు ఉదయం నుంచే స్వామివారి వేడుకలు ప్రారంభమయ్యాయి స్వామి వారిని విశేషంగా అలంకరించారు స్వామివారి విగ్రహానికి రకరకాల పూలమాలతో అలంకరించారు ఆలయానికి వచ్చిన భక్తులు విశిష్ట పూజలు చేశారు ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది కొంతమంది భక్తులు తమ చిన్నారులను శ్రీకృష్ణుని అలంకారం తో అలంకరించారు చాలా మంది చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణతో రావడం జరిగింది వారిని చూసిన పలువురు భక్తులు పరవశించి పోయారు ఆలయ ప్రాంగణంలో ఉట్టి ఉత్సవం నిర్వహించారు ఈ ఉత్సవంలో పలువురు భక్తులు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఆడా చైర్మన్ సింగ సాని గురు మోహన్ ప్రారంభించారు కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి యాదవ్ యాదవ సంఘం నాయకులు బుర్రి రాజా యాదవ్ తదితరులు పాల్గొని ఉత్సవానికి ప్రత్యేక శోభ తీసుకువచ్చారు శ్రీకృష్ణ జయంతి వేడుకలు గతంలో ఎప్పుడు జరగని రీతిలో జరిపించారు ఇదే సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదం చేశారు

# ఇంటిగ్రేటెడ్ యాప్‌ల భారం నుండి ఉపాధ్యాయులను మినహాయించాలి



## పూర్తిస్థాయి పర్యవేక్షణాధికారులను నియమించాలి

## తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్

నంద్యాల :- విద్యార్థులకు బోధన చేయాల్సిన ఉపాధ్యాయులను పలురకాల యాప్‌ల పేరుతో బోధనేతర కార్యక్రమాలకు కేటాయించడాన్ని, అధికారులు తీవ్రస్థాయిలో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడాన్ని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు . ఈ పద్ధతి ఉపాధ్యాయుల్ని వేధించడానికి తప్ప విద్యా వ్యవస్థను సంస్కరించడానికి పనికి రాదన్నాడు . పాఠశాలల విలీనం పేరుతో విద్యారంగంలో గందరగోళ పరిస్థితులు సృష్టించిన ప్రభుత్వం, ఇప్పుడు తాజాగా యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురి చేయటం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేదు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్న ఉపాధ్యాయులకే పనిభారాన్ని పెంచిన ప్రభుత్వం, అదనంగా యాప్‌ల పేరుతో బెదిరింపులకు దిగటం, విద్యార్థుల హాజరు సమయానికి నమోదు చేయలేదని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయటం తీవ్ర అభ్యంతరకరం. ప్రభుత్వం ఇవ్వాల్సిన డివైజ్‌లను పాఠశాలలకు సప్లయ్ చేయకుండా, ఉపాధ్యాయుల స్వంత మొబైల్ నుంచే 9 గంటల లోపు హాజరు నమోదు చేయాలని, లేకపోతే సాధారణ సెలవు కాకుండా ఇతర సెలవులను నమోదు చేయాలని, ఇ'హాజరు జీతాలకు లింకు చేస్తామని బెదిరింపులు చేయటం అప్రజాస్వామికం. ఇలాంటి నిరంకుశ చర్యలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. గడిచిన 4 సంవత్సరాలుగా పాఠశాలలని పర్యవేక్షణ చేయాల్సిన ఎంఇఓ, డివైఇఓ పోస్టులను సగానికి సగం ఖాళీగా ఉన్నాయి. ఈ పనికి కూడా సాంకేతికత పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం బోధనకు ఆటంకం. ఉదయం పాఠశాల ప్రారంభం నుండి 14 రకాల యాప్‌లతో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఈ పనికే కేటాయిస్తూ ఉండగా, ఇప్పుడు అదనంగా ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ప్రవేశ పెట్టడం, ఉపాధ్యాయుల స్వంత మొబైల్ నుండి హాజరు నమోదుచేయాలని చెప్పటం ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయటమే. ప్రభుత్వ విధానాలను ఉపాధ్యాయులు విమర్శించకూడదని చెబుతున్న ప్రభుత్వం, విధానాలను రూపకల్పన చేసేముందు ప్రజాస్వామ్య పద్ధతిలో అందరితో చర్చించకపోవటం తీవ్ర అభ్యంతరకరం.ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులతోబాటు పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వమే డివైజ్‌లను ప్రతి పాఠశాలకు సప్లయ్ చేయాలని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

బద్వేలు , బద్వేలు పట్టణం రెడ్డయ్యమఠం వీధిలో శుక్రవారం శ్రీకృష్ణ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు శ్రీకృష్ణ పరమాత్మునికి ముందుగా ప్రత్యేక పూజలు జరిపించారు భక్తులు కుటుంబాలు సహా వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ప్రతి సంవత్సరం ఈ ఆలయంలో శ్రీ కృష్ణ జయంతి వేడుకలు ఎంతో ఘనంగా జరిపించడం ఆనవాయితీ ఈసారి కూడా అలాగే జరిపించారు ఉట్టి ఉత్సవం కూడా కోలాహలంగా జరిగింది ఉట్టి కొట్టిన విజేతకు తెలుగుదేశం పట్టణ ప్రధాన కార్యదర్శి 33వ వార్డు ఇంచార్జి మిత్తకాయల రమణ యాదవ్ నగదు బహుమతి అందజేశారు



# అక్షర కి ఏమైనా పని అవుద్దా..!



యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ కూతుర్లు ఇద్దరు కూడా మల్టీ ట్యాలెంటెడ్ అనడంలో సందేహం లేదు. శృతి హాసన్ ఒక వైపు హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు సంగీత దర్శకురాలిగా.. సింగర్ గా.. ఫ్యాషన్ డిజైనర్ గా కూడా చేస్తూ బిజీగా ఉన్న విషయం తెల్సిందే. శృతి హాసన్ కెరీర్ లో సక్సెస్ అయినంతగా ఆమె సోదరి.. కమల్ చిన్న కూతురు అక్షర హాసన్ సక్సెస్ అవ్వలేక పోయింది.అక్షర హాసన్ నటిగా కాకుండా మొదట సహాయ దర్శకురాలిగా కెరీర్ ను ప్రారంభించింది. ఆమె కెరీర్ ప్రారంభించి చాలా సంవత్సరాలు అయినా కూడా ఇప్పటి వరకు ఒక మంచి కమర్షియల్ సక్సెస్ ను దక్కించుకోలేక పోయిందిఅక్షర హాసన్ నటిగా ఇప్పటికే పలు సినిమాల్లో నటించింది. ఆ సినిమాలు నటిగా మంచి పేరు తెచ్చి పెట్టాయి కాని కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకోలేదు.నటిగా అక్షర హాసన్ తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. హీరోయిన్ గా ఆఫర్ల కోసం సోషల్ మీడియా ద్వారా హాట్ ఫోటో షూట్స్ ను షేర్ చేస్తూ ఉంది. ఒకప్పటితో పోల్చితే ఇప్పుడు అక్షర షేర్ చేస్తున్న ఫోటోలు మరియు వీడియోలు ఆమె రేంజ్ ను బాగా పెంచేస్తున్నాయి అంటున్నారు. ఇలాంటి ఫోటోలను షేర్ చేస్తే ముందు ముందు భారీ ఎత్తున కమర్షియల్ సినిమాల్లో ఈ అమ్మడికి అవకాశాలు వస్తాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోందిబాలీవుడ్ తో పాటు సౌత్ లో కూడా నటించేందుకు సిద్ధంగా ఉన్న అక్షర హాసన్ కి అడపా దడపా ఆఫర్లు వస్తున్నాయి. స్కిన్ షో చేస్తూ ఈ అమ్మడు షేర్ చేసిన తాజా ఫోటోల కారణంగా ఈ అమ్మడికి బాలీవుడ్ నుండి పిలుపు ఏమైనా వెంటనే వస్తుందేమో చూడాలి.అక్షర హాసన్ తన సోదరి శృతి హాసన్ మాదిరిగా కమర్షియల్ హీరోయిన్ గా పేరు దక్కించుకోవాలనే ప్రయత్నాలు చేస్తోంది. మరి అక్షర కి ఇలా అయినా పని అయ్యేనా చూడాలి.

# వశిష్ఠ్ కూడా మరో అనిల్ రావిపూడి అవుతాడా?

అనిల్ రావిపూడి.. ఈయన గురించి ప్రత్యేకమైన పరిచయాలు అవసరం లేదు. టాలీవుడ్ టాప్ డైరెక్టర్ల లిస్ట్ తీస్తే.. అందులో ఖచ్చితంగా అనిల్ రావిపూడి పేరు ఉంటుంది. బ్రేకుల్లేని హిట్స్ తో కెరీర్ ను సక్సెస్ ఫుల్ గా రాణిస్తున్న అనిల్ రావిపూడి.. ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్ గా గుర్తింపు పొందారు. అయితే వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈయన.. కెరీర్ స్టార్టింగ్ లో మాత్రం ఎన్నో స్ట్రగుల్స్ ను ఫేస్ చేశారు.రైటర్ గా సినీ ఇండస్ట్రీలో కెరీర్ స్టార్ట్ చేసిన అనిల్ రావిపూడి.. డైరెక్టర్ గా తొలి సినిమాను తెరకెక్కించేందుకు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాంటి తరుణంలో నందమూరి కళ్యాణ్ రామ్ ధైర్యం చేసి ఆయనకు మొదటి అవకాశాన్ని ఇచ్చారు. అలా వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన చిత్రమే 'పటాస్'. 2015లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది.వరుస ఫ్లాపులతో సతమతం అవుతున్న కళ్యాణ్ రామ్ ఈ మూవీతో మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కాడు. అలాగే అనిల్ రావిపూడి 'పటాస్'తో అందరి చూపులను తనవైపుకు తిప్పుకున్నాడు. ఇప్పుడీయన స్టార్ డైరెక్టర్ హోదాను అనుభవిస్తున్నాడు అంటే ఒక విధంగా కళ్యాణ్ రామ్ కారణమనే చెప్పాలి. ఇకపోతే 'పటాస్' తర్వాత ఆ స్థాయిలో హిట్ అందుకోలేకపోయిన కళ్యాణ్ రామ్.. రీసెంట్ గా 'బింబిసార'తో ప్రేక్షకులను పలకరించాడు.ఆగస్టు 5న విడుదలైన ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా వివరించి చెప్పక్కర్లేదు. ఈ సినిమా మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుంది. అంతేకాదు కళ్యాణ్ కెరీర్లోనే బింబిసార అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డులకు ఎక్కింది. ఇక ఈ సినిమాతో కళ్యాణ్ రామ్ మల్లిడి వశిష్ఠ్ అనే మరో కొత్త దర్శకుడిని ఇండస్ట్రీకి పరిచయం చేశాడు.డైరెక్టర్ గా అనుభవం లేని వ్యక్తి పైగా సోసియో ఫాంటసీ కథ అయినా సరే కళ్యాణ్ రామ్ నమ్మకంగా వశిష్ఠ్ కు ఛాన్స్ ఇచ్చాడు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్న వశిష్ఠ్.. కళ్యాణ్ రామ్ కు బిగ్ హిట్ ను అందించాడు. తొలి సినిమా అయినప్పటికీ 'బింబిసార'ను అద్భుతంగా తెరకెక్కించి విమర్శకుల నుండి ప్రశంసలు అందుకున్నాడు.దీంతో ఇప్పుడు ఈ కొత్త దర్శకుడితో సినిమాలు చేసేందుకు టాలీవుడ్ హీరోలు మొగ్గు చూపుతున్నారు. మొన్నటికి మొన్న నటసింహం నందమూరి బాలకృష్ణ కూడా వశిష్ఠ్ తో సినిమా చేస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే వశిష్ఠ్ కూడా మరో అనిల్ రావిపూడి అవుతాడంటూ సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. మరి నిజంగానే వశిష్ఠ్ అనిల్ రావిపూడి మాదిరి టాలీవుడ్ లో స్టార్ డైరెక్టర్ గా గుర్తింపు పొందుతాడా..లేదా.. అన్నది చూడాలి.



# శేఖర్ కమ్ముల డ్రీమ్ నెరవేరేనా?

టాలీవుడ్ లో శేఖర్ కమ్ములకు సెన్సిబుల్ మూవీస్ డైరెక్టర్ గా ప్రత్యేక గుర్తింపు వుంది. ఆయన సినిమాలని ఇష్టపడని స్టార్ లేరంటే అది అతిశయోక్తి కాదేమో. తను అనుకున్న కథని అంతే నిజాయితీగా ఎమోషన్స్ ని జోడించి తెరకెక్కించడంతో శేఖర్ కమ్ముల శైలి ప్రత్యేకంగా. అందుకే ఆయన సినిమాలంటే స్టార్స్ కూడా ప్రత్యేక ఆసక్తిని చూపిస్తుంటారు. అయితే ఆయనకు మాత్రం ఓ డ్రీమ్ వుంది. ఎప్పటికైనా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సూపర్ స్టార్ మహేష్ బాబు తో సినిమాలు చేయాలన్నది ఆయన కల.రెండు మూడు సార్లు ట్రై చేసి విఫలమయ్యారు కూడా. 'ఫిదా' సినిమాని సూపర్ స్టార్ మహేష్ బాబు తో చేయాలనుకున్నారు. అయితే ఆయన ఈ కథ చేయడానికి సున్నితంగా తిరస్కరించారట. ఇది హీరోయిన్ ప్రధానంగా సన్నితమైన భావోద్వేగాల సమారంగా సాగే క్యూట్ లవ్ స్టోరీ. దీని సోల్ ని చెడగొట్టడం ఇష్టం లేకే మహేష్ బాబు చేయనని చెప్పారట. అయితే త్వరలో మహేష్ బాబు తో శేఖర్ కమ్ముల సినిమా చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.దగ్గుబాటి రానాని హీరోగా పరిచయం చేస్తూ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ ఏవీఎం ప్రొడక్షన్స్ గత కొన్నేళ్ల క్రితం 'లీడర్' మూవీని నిర్మించిన విషయం తెలిసిందే. సమకాలీన రాజకీయాంశాల నేపథ్యంలో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సాధించడమే కాకుండా విర్శకుల ప్రశంసల్ని సైతం సొంతం చేసుకుంది. హీరోగా రానాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ మూవీకి సీక్వెల్ గా 'లీడర్ 2' రానుందంటూ గత కొన్ని నెలలుగా వార్తలు వినిపిస్తున్నాయి.రజనీకాంత్ తో ఈ మూవీ చేసే అవకాశం వుందని ఆ మధ్య వార్తలొచ్చాయి. కానీ దీనిపై శేఖర్ కమ్ముల స్పందించకపోవడంతో ఇది వట్టి రూమరే అని తేలిపోయింది. తాజాగా సూపర్ స్టార్ మహేష్ బాబు తో 'లీడర్ 2' ని శేఖర్ కమ్ముల చేయబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా వరుస కథనాలు వినిపిస్తున్నాయి. ఏవీఎం ప్రొడక్షన్స్ నేటి తరం నిర్మాతల్లో ఒకరైన అరుణ గుహ తాజాగా 'లీడర్2'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం విశేషం.ఈ విషయమై ఆమెని ప్రశ్నిస్తే.. దీనికి సంబంధించిన చర్చలు జరిగాయని ఇంత వరకు అవి కొలిక్కి రాలేదని స్పష్టం చేశారు. అంతే కాకుండా మేము గమనిస్తూ ముందుకు వెళ్లాలనుకుంటున్నామని తెలిపారు.అయితే భవిష్యత్తులో మాత్రం ఖచ్చితంగా మహేష్ బాబు పవన్ కల్యాణ్ చిరంజీవి వంటి తెలుగు స్టార్స్ తో కలిసి పని చేయాలనుకుంటున్నామని అసలు విషయం బయటపెట్టారు. ఇదే సందర్భంగా రజనీకాంత్ - శంకర్ ల కలయికలో వచ్చిన 'శివాజీ' సీక్వెల్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్ట్ 1 కంటే పార్ట్ 2 కథ మరింత శక్తివంతంగా వుంటుందని స్పష్టం చేయడం విశేషం.



# గంభీర్ అభిమానులకు గుడ్ న్యూస్.. మళ్లీ బ్యాట్ పట్టనున్న గౌతీ!




టీమిండియా మాజీ ఆటగాడు గౌతమ్ గంభీర్ లెజెండ్స్ లీగ్ క్రికెట్ రెండో సీజన్‌లో భాగం కానున్నాడు. ఈ విషయాన్ని గంభీర్ శుక్రవారం ధృవీకరించాడు. ఈ క్రమంలో గౌతీ మాట్లాడుతూ.. "మళ్లీ క్రికెట్ మైదానంలో అడుగుపెట్టేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నాను. లెజెండ్స్ లీగ్ క్రికెట్‌లో దిగ్గజ ఆటగాళ్లతో ఆడే అవకాశం రావడం నాకు చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నాడు. కాగా ఈ టోర్నీ కోసం తొలుత ప్రకటించిన ఇండియా మహారాజాస్ జట్టులో గంభీర్ పేరు లేదు. లెజెండ్స్ లీగ్ క్రికెట్-2022 సెప్టెంబరు 17 నుంచి ప్రారంభం కానుంది.ఈ టోర్నీలో మొత్తం ఆరు జట్లు తలపడనున్నాయి. కాగా టోర్నీ ఓ ప్రత్యేకమైన మ్యాచ్‌తో ఆరంభం కానుంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇండియా మహరాజాస్, వరల్డ్ జెయింట్స్ మధ్య సెప్టెంబర్ 16న ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఓ చారిటీ మ్యాచ్ జరగనుంది. ఇండియా మహరాజాస్‌కు బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కెప్టెన్‌గా ఎంపిక కాగా.. వరల్డ్ జెయింట్స్‌కు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ సారథ్యం వహించనున్నాడు.గంభీర్ 2018లో అన్ని రకాల క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. 2007 టీ20 వరల్డ్‌కప్, 2011 వన్డే ప్రపంచకప్‌లను భారత్ కైవసం చేసుకోవడంలో గంభీర్ కీలక పాత్ర పోషించాడు. టీమిండియా తరపున 58 టెస్టులు, 147 వన్డేలు, 37 టీ20ల్లో గంభీర్ ప్రాతినిధ్యం వహించాడు. అతడు మూడు ఫార్మాట్‌లు కలిపి 10324 పరుగులు సాధించాడు. ఇక ఐపీఎల్‌లోనూ తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర ఏర్పరుచుకున్నాడు. గౌతీ సారథ్యంలో కోల్‌కతా నైట్ రైడర్స్ 2012, 2014 ఐపీఎల్ టైటిల్స్‌ను గెలుచుకుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**